క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వేణుగోపాల్, తదితరులు

షాద్‌నగర్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సభ్యులు కలిశారు. కోర్టుకు అదనపు భవనం కేటాయించడంతో పాటు కోర్టు ఆవరణలో బీటీరోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అదనపు భవన నిర్మాణానికి ఎస్టిమేషన్ కొటేషన్ తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే కోర్టు ఆవరణలో బీటీరోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ నర్సింలు, లైబ్రరీ సెక్రటరీ రమేశ్, సభ్యులు శ్రీశైలం, విజయ్‌కుమార్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నాయకులు, భక్తులు

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెరి మల్లేశ్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల సోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని చిలుకూరు బాలాజీ శివాలయ వేదపండితుడు సురేష్‌స్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో సంగెరి మల్లేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, వైసీపీ జిల్లా నాయకుడు ముదిగొండ రాజయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనం, అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జంగంయాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నాయకులు

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగులపల్లి రాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 41 మంది లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, నరేశ్, శ్రీకాంత్‌రెడ్డి, భిక్షపతి, వెంకట్‌రెడ్డి, గన్నేపాగ నర్సింగ్‌రావు, నాగేశ్వర్‌రావు, ఆంజనేయులుగౌడ్, నయీముద్దీన్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లిలోని శ్రీదశావతార సహిత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, సాయంత్రం స్వామివారి ఊరేగింపు ఎదుర్కోళ్లు, రాత్రి స్వామివారి తిరుకల్యాణోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించారు. ఈ నెల 4వ తేదీవరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ప్రధాన అర్చకులు శ్రీమాన్‌డాచూర్ వెంకటరాఘవన్, వెంకటనాదాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో అన్ని గ్రామాల నుంచి ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.



వెంకటాపూర్ వంతెన వద్ద గుంతలమయంగా..



శ్రీరాంనగర్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రతిపాదనలకే పరిమితం!

- వెంకటాపూర్–చందానగర్ రోడ్డును ఆర్అండ్‌బీకి మార్చడంలో అలసత్వం
- పదినెలలు దాటినా వెలువడని ఉత్తర్వులు
- పంచాయతీరాజ్ నుంచి మంజూరైన నిధులు వెనక్కి
- అధ్వాన దారితో వాహనదారులకు తప్పని తిప్పలు

మొయినాబాద్: వెంకటాపూర్–చందానగర్ రోడ్డును పంచాయతీరాజ్ నుంచి రోడ్డు భవనాల శాఖకు మార్చే ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితమైంది. మంత్రి ఆదేశాలతో రోడ్డును సర్వే చేసిన అధికారులు పది నెలలు దాటినా ఉత్తర్వులు జారీ చేయకుండా అలసత్వం వహిస్తున్నారు. అధ్వానంగా మారిన రోడ్డు అభివృద్ధిపై రెండు శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు, స్థానికులకు తిప్పలు తప్పడం లేదు.

రూ.60కోట్లు అవసరమని అంచనా..

మొయినాబాద్ మండలంలోని చందానగర్ చౌరస్తా నుంచి పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ మీదుగా శంషాబాద్ మండలంలోని కవేలిగూడ వరకు 16 కిలోమీటర్ల దూరం రహదారిని పంచాయతీరాజ్ నుంచి రోడ్డు భవనాల శాఖకు మార్చాలని గత సంవత్సరం ఆగస్టులో స్థానిక నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ రహదారి నిర్మాణంతో మూడు మండలాల మధ్య రాకపోకలు పెరగడంతో పాటు స్థానికులకు సైతం ఉపయోగపడుతుందని మంత్రికి తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన 16 కిలోమీటర్ల దూరం రోడ్డును సర్వే చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ఆగమేగాల మీద పరుగెత్తుకొచ్చిన అధికారులు రోడ్డు సర్వే చేశారు. ఎక్కడెక్కడ కల్వర్టులు, వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందో గుర్తించారు. రోడ్డు నిర్మాణానికి రూ.60కోట్ల నిధులు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు.

కొన్ని నెలలు గడిచినా..

చందానగర్–వెంకటాపూర్ రోడ్డును పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీ శాఖకు మార్చాలని గత ఏడాది ఆగస్టులోనే ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది పరిస్థితి. పంచాయతీరాజ్ అధికారులు ఆర్అండ్‌బీకి మార్చడానికి అంగీకరిస్తూ ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ రోడ్డు భవనాల శాఖకు మారుస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు జారీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది.

నిధులు వెనక్కి..

రోడ్డు భవనాల శాఖకు మార్చాలనే ప్రతిపాదనలో ఉన్న 16 కిలోమీటర్ల రోడ్డులో చందానగర్ నుంచి పెద్దమంగళారం వరకు 4 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితమే పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.2.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ అప్పట్లో పనులు మొదలు పెట్టలేదు. పదినెలల క్రితం ఆర్ అండ్‌బీశాఖకు రోడ్డు మారుతుందనే ప్రతిపాదనలు రావడంతో అధికారులు మంజూరైన నిధులను ఖర్చుచేయకుండా వెనక్కి పంపారు.

రోడ్డంతా గుంతలమయం

ఆర్అండ్‌బీకి మార్చాలని ప్రతిపాదించిన 16 కిలోమీటర్ల దూరం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు ప్రతి రోజు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేసినా కుదుపులు తగ్గుతాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీకి ఇంకా మారలేదు. దానికి సంబంధించిన జీవో రావాల్సి ఉందని చెప్పారు.

అధికారుల నిర్లక్ష్యం

వెంకటాపూర్–చందానగర్ రోడ్డును ఆర్అండ్‌బీ శాఖకు మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పదినెలల క్రితమే మంత్రిని కలిసి విన్నవించడంతో సర్వే చేయించారు. రోడ్డు అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. కానీ పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీకి మార్చే ప్రక్రియలోనే ఆలస్యం జరుగుతోంది. అధికారులు తొందరగా ప్రక్రియ పూర్తి చేసి రోడ్డును అభివృద్ధి చేయాలి.

–పట్నం రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ, శ్రీరాంనగర్

ప్రతిపాదనలు పంపాం

చందానగర్ నుంచి వెంకటాపూర్ వరకు 16 కిలోమీటర్ల దూరం పంచాయతీరాజ్ రోడ్డును ఆర్అండ్‌బీ శాఖకు మార్చడానికి ప్రతిపాదనలు పంపాం. ఆ ప్రక్రియ పూర్తి అయ్యిందో లేదో తెలియదు. చందానగర్ నుంచి పెద్దమంగళారం వరకు రోడ్డు అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ నుంచి మంజూరైన నిధులను ఖర్చుచేయకుండా ఆపేశాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ

పంట మార్పిడితో అధిక దిగుబడి

వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు లీలారాణి, సుక్రుల్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మొయినాబాద్: రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి అధిక దిగుబడులు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు లీలారాణి, సుక్రుల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు పద్ధతులు, భూసారం పెంపు, నీటి వనరులు, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ సీజన్‌లో ఒకే రకమైన పంట వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. యూరియా, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని, తద్వారా భూమిలో భూసారం పెరిగి నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కూరగాయ పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, మల్చింగ్ పేపర్ వాడుకోవడంతో నీటి వృథాను తగ్గించి కలుపు నివారించుకోవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ప్రత్యేక అధికారి అహ్మద్, మాజీ సర్పంచ్ మనోజ్‌కుమార్, ఆదర్శ రైతులు మోహన్‌రెడ్డి, రవీందర్, కృష్ణ, సత్యనారాయణ, ఏఈఓ కుమార్, పీహెచ్‌డీ విద్యార్థులు తరుణ్, నవ్య, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

నందిగామ: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడలో శనివారం రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్, రైతులు శంకరయ్య, తుమ్మల నర్సింహ, మెక్కొండ కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యం



చనువెళ్లిలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

చేవెళ్ల: వ్యవసాయంలో ఆధునిక విధానాల ద్వారా అధిక దిగుబడి రాబట్టి రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కొనసాగుతుందని శాస్త్రవేత్తలు డా.శ్రీకృష్ణ, డా.ప్రియ అన్నారు. మండలంలోని చనువెళ్లి, పామెన గ్రామాల్లో శనివారం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియన్ ద్వారా రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడుతూ.. వ్యవసాయంలో రైతులకు మంచి దిగుబడులతో ఆదాయాన్ని పెంచేందుకు నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఉద్యానవన అధికారి కీర్తికృష్ణ, ఏఈఓలు రమ్య, స్వాతి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిగూడలో..

షాబాద్: మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిణామాలు పరిచయం చేస్తున్నట్లు వివరించారు. అందులో ఆధునాతన పంట విధానాల అమలుతో పాటు అధిక దిగుబడి, అధిక లాభం కలిగించే తోటల సాంకేతికతలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికత ప్రయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈఓ గీత, ఉద్యానవనశాఖ అధికారి కీర్తికృష్ణ, రైతులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈఓ మనోహర్



బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల కాంప్లెక్స్ పరిధిలో ఎంఈఓ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిగూడ, కొండన్నగూడ, కాలనీతండా, కొంగగూడ గ్రామాల్లో పర్యటించి చిన్నారుల తల్లితండ్రులతో మాట్లాడారు. సర్కారు బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ విద్యాసంవత్సరం అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలను సాధించామని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటయ్య, నర్సింలు, కృష్ణ, పతంజలి, మేఘబాయి, సురేష్‌కుమార్, అంజన్‌నాయక్, హెచ్‌ఎం స్వర్ణలత, యాదయ్య, నాగమణి, శ్రవణ్‌కుమార్, ఇందిర, సీఆర్పీ రాధాకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామంలోనే పింఛన్ ఇప్పించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: పింఛన్ తీసుకోవాలంటే ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, దీంతో వృద్ధులు, వితంతువులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని పలువురు పేర్కొన్నారు. మా గ్రామంలోనే పింఛన్ ఇప్పించండి సారూ అంటూ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ బన్సిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కంసాన్‌పల్లి గ్రామానికి పోస్టాఫీసు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాలలో ఉందని, దీంతో పెన్షన్‌దారులు ప్రతి నెల 5 కి.మీ దూరంలో ఉన్న ఆ గ్రామానికి వెళ్లి పెన్షన్ తీసుకునే పరిస్థితి నెలకొందని తెలిపారు. సంవత్సరాల తరబడి ఈ కష్టాలు తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మా పింఛన్ మా గ్రామంలోనే ఇప్పించండి అని వేడుకున్నారు. తక్షణమే స్పందించిన ఎంపీడీఓ మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో వృద్ధులు, వితంతువులు, గ్రామస్తులు ఉన్నారు.

శేష జీవితం సంతోషంగా గడపాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య



ఉపేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న కిష్టయ్య, ఉద్యోగులు

కేశంపేట: పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఈఓగా విధులు నిర్వహిస్తున్న కుంభం ఉపేందర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని మండలంలోని అశోక్‌రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శనివారం తోటి ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి దంపతులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ నర్సింహారెడ్డి, ఉద్యోగులు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, విద్యావతి, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు విరమణ సహజం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య, సిబ్బంది

కొత్తూరు: ప్రభుత్వ ఉద్యోగులు తాము విధులు నిర్వహించే చోట తమ సేవలను ప్రజలు గుర్తుంచుకునేలా పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సన్మాన సభలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన వనం రాంచందర్‌రావును ఆమెతో పాటు సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగులకు పదవి విరమణ సహజమన్నారు. కానీ విధులు నిర్వహించే ప్రతీ చోట ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, సోమ్లనాయక్, మాదారం నర్సింలుగౌడ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, జనార్దన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిపై వ్యాఖ్యలు సరికాదు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలో గల 11వ శతాబ్దపు మరకత శివాలయానికి సంబంధించి ఎవరూ ఎలాంటి అసంబద్ధ వ్యాఖ్యలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. శనివారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కొంత మంది వ్యక్తులు ఆలయాన్ని తాము అభివృద్ధి చేశామని, ప్రస్తుతం అక్రమ వసూళ్లు చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ఐసీడీఎస్ సీడీపీఓ హెప్సిబా, ఎంపీడీఓ అపర్ణ



సూపర్‌వైజర్ రమాదేవి దంపతులను సన్మానిస్తున్న సీడీపీఓ హెప్సిబా, ఎంపీడీఓ అపర్ణ, తదితరులు

షాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో చేసిన సేవలే ప్రజల్లో గుర్తింపునిస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ హెప్సిబా, ఎంపీడీఓ అపర్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని సీతారాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి, ఖాజామొయినొద్దీన్ దంపతులను శాలువా, పూలదండలతో అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. సూపర్‌వైజర్‌గా ఆమె ఉత్తమ సేవలు అందించారని అభినందించారు. తన శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సృజన, పారిజీత, సునీత, యశశ్విని, అనురాధ, శకుంతల, రేవతి, జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, అంగన్‌వాడీ టీచర్లు మీన, సౌభాగ్య, అంబుజాక్షి, విజయలక్ష్మి, ప్రమీల, కంసమ్మ, యాదమ్మ తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



కేశంపేట: అహల్యాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కేశంపేట: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు మహారాష్ట్రలోని హోల్కర్ రాజవంశంకు చెందిన మహారాణి అహల్యాబాయి విశేష కృషి చేశారని బీజేవైఎం జిల్లా అధికార ముల్తాంకార్ శివాజీ అన్నారు. అహల్యాబాయి జయంతిని బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, బ్రహ్మచారి, రాజు, సందీప్, శివగౌడ్, రాములు, శ్రీకాంత్, మల్లేశ్, శ్రీనివాస్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అహల్యాబాయి జీవితం అందరికీ ఆదర్శం

శంకర్‌పల్లి: స్త్రీ జాతి మనుగడ కోసం నిరంతరం శ్రమించిన ధీర వనిత అహల్యాబాయి హోల్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ సామాజిక సమరసత సంస్థ నాయకులు స్పష్టం చేశారు. అహల్యాబాయి త్రిశతాబ్ది జయంతిని శనివారం శంకర్‌పల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు విద్యార్థులకు పోటీ పరీక్షలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వక్తలు నరేందర్, చంద్రమౌళి, సంస్థ సభ్యులు దామోదర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కాశీనాథ్, దయాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, నితిన్, ఉపాధ్యాయులు రాజశేఖర్, జంగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.